సిరులు కురిపించే వెదురు సాగు

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, పక్కన అదనపు కలెక్టర్ విద్యాచందన

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : వెదురు సాగు రైతుల ఇంట సిరులు కురిపిస్తుందని, ఈ సాగుపై మక్కువ పెంచుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో ఇండస్ట్రీస్ క్రాఫ్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చండ్రుగొండ, ములకలపల్లి, గుండాల మండలాల ఏపీఎంలు, ఏపీవోలు, సీసీలు, ఎఫ్‌పీసీలు, వీవో ఏసీలు, అటవీ శాఖ సిబ్బందికి వెదురు పెంపకంపై సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6.18 లక్షల వెదురు మొక్కల సాగు లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాలన్నారు. సాగుకు పై మండలాల్లో భూములు ఎంతో అనుకూలమని, అవసరమైన నీటి వసతులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఐదెకరాల వ్యవసాయం చేస్తూ బోరు సౌకర్యం ఉన్న రైతులు ఎకరం వెదురు సాగు చేపట్టే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే మునగ సాగు ద్వారా స్వల్ప కాలంలోనే ఆదాయం సమకూరుతుందని, వెదురు సాగు ద్వారా ఎఫ్‌డీ మాదిరిగా ఒక్కసారి పెట్టుబడితో నిరంతర ఆదాయం చేకూరుతుందన్నారు. జిల్లాలో జామాయిల్ సాగుకు సమానంగా వెదురు సాగు చేపట్టాలని, ఆ దిశగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, ఉద్యాన అధికారి కిశోర్, ఇండస్ట్రీ క్రాఫ్ట్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ రమ్య, డాక్టర్ శ్రీకాంత్, ఆపరేషన్ మేనేజర్లు అమృత, అక్షయ్, టెక్నికల్ మేనేజర్ కుసుమకుమారి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న జడ్పీ సీఈవో నాగలక్ష్మి

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ): జిల్లాలో 22 జడ్పీటీసీ, 236 ఎంపీటీసీ స్థానాల్లోని ఓటర్ల తుది జాబితాను అధికారులు సిద్ధం చేశారు. షెడ్యూల్‌లో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో దీనిని సీఈవో నాగలక్ష్మి ప్రదర్శించారు. దీనిని అన్ని మండల పరిషత్ కార్యాలయాలకు పంపించారు. వాటిని మండల అధికారులు తమ కార్యాలయాల్లో ప్రదర్శించారు. ఈ జాబితా ప్రకారం.. జిల్లాలో 6,57,366 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,19,626 మంది, స్త్రీలు 3,37,718 మంది, ఇతరులు 22 మంది ఉన్నారు. జడ్పీ డిప్యూటీ సీఈవో చంద్రశేఖర రావు, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

జాతర కోసం అన్ని ఏర్పాట్లు చేయాలి

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కరకగూడెం, ఫిబ్రవరి 10: చిరుమల్ల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఏపీవో డేవీడ్‌రాజ్.. స్థానిక అధికారులకు సూచించారు. భక్తుల సౌకర్యం కోసం తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండలంలోని చిరుమల్ల సమ్మక్క సారలమ్మ జాతర కోసం చేస్తున్న ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, కమిటీ సభ్యులతో మాట్లాడుతూ.. ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు.

'నన్ను ధరించు...నిన్ను రక్షిస్తా'

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వెంకటపుల్లయ్య

భద్రాచలం, ఫిబ్రవరి 10: జాతీయ భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం భద్రాచలం యూనిట్ కార్యాలయంలో 'నన్ను ధరించు...నిన్ను రక్షిస్తా' అనే నినాదంతో వాహనదారులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య మాట్లాడుతూ వాహనదారులకు హెల్మెట్ అనేది రక్షణతో కూడిన బాధ్యత అని బరువు కాదని అన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడిపితే ప్రాణాల నుంచి కాపాడటమే కాకుండా కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోకుండా ఉంటుందన్నారు. హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వాహనదారులు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పనుల పరిశీలన

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10: పట్టణంలో రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు.

విద్యార్థుల మేధాశక్తిని వెలికితీసేందుకు కంప్యూటర్ శిక్షణ

ఐటీడీఏ పీవో రాహుల్

కంప్యూటర్లను పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 10: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు చదువుతో పాటు కంప్యూటర్ ద్వారా మేధాశక్తిని, వారిలో దాగిన ప్రతిభను వెలికితీసేలా కంప్యూటర్లను అందించి అవగాహన కల్పిస్తున్నామని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. సోమవారం పీఎంఆర్‌సీలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసేందుకుకు కొనుగోలు చేసిన కంప్యూటర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా ప్రత్యేకంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కంప్యూటర్ బేస్‌లెవల్, ఎక్సెల్ వర్డ్స్, మెయిల్స్, టైపింగ్, గేమ్స్, పజిల్స్, మైన్స్‌పార్క్, ప్రోగ్రామ్, పెయింటింగ్స్, కార్టూన్స్ ఇతర కంప్యూటర్ నాలెడ్జ్‌కు సంబంధించి అంశాలు విద్యార్థులకు కంప్యూటర్ ద్వారా అవగాహన కల్పిస్తామని పీవో పేర్కొన్నారు. ప్రస్తుతం 90 కంప్యూటర్లు పాఠశాలలకు సరఫరా చేస్తున్నామని తెలిపారు. పాఠశాల పేరు, గ్యారెంటీ కార్డు అందించి ఆ పాఠశాల కంప్యూటర్ నిర్వహణ చేసేవారికి అందించి రసీదు తీసుకోవాలని డీడీని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏసీఎంవో రమణయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు రాజేశ్, శేఖర్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

గోడలపై కళాకృతుల చిత్రాలు చిత్రీకరించాలి

ఆదివాసీ గిరిజన తెగల సంస్కృతితో పాటు జీవన విధానానికి సంబంధించి కళాకృతుల చిత్రాలను గోడలపై చిత్రీకరించాలని పీవో రాహుల్ అన్నారు. సోమవారం ఐటీడీఏ ప్రాంగణంలో గిరిజన మ్యూజియాన్ని ఆయన సందర్శించి గిరిజన కల్చర్‌కు సంబంధించి పెయింటింగ్ చిత్రాలను పరిశీలించారు. చిత్రాలు చిత్రీకరించే క్రాఫ్ట్ టీచర్లకు సూచనలు చేశారు. మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకులకు మ్యూజియం లోనికి వచ్చేముందే కళాఖండాలు ఆకర్షించేలా ఉండాలన్నారు. గిరిజన జీవన విధానం ఉట్టిపడేలా గిరిజన మహిళల దుస్తుల అలంకరణ, కట్టు, బొట్టు, గిరిజన రైతుల పంటలసాగు, కులవృత్తి, పూజా విధానం, అన్ని తెగల గిరిజనుల పండుగలు, ఇలవేల్పుల దేవతామూర్తుల చిత్రాలు ఆకట్టుకునేలా చిత్రీకరించాలన్నారు. చిన్నారులు ఆడుకునే బాక్స్ క్రికెట్ గ్రౌండ్ 20 రోజుల్లో పూర్తిస్థాయిలో నిర్మాణం కావాలని స్పోర్ట్స్ అధికారి గోపాలరావుకు సూచించారు.

జాతీయ క్రీడల్లో కాంస్య పతకం

మాలోత్ సింధు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 10: ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరుగుతున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో 4x100 మీటర్ల రిలే విభాగంలో కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థిని మాలోత్ సింధు కాంస్య పతకం సాధించింది. ఆమెను, కోచ్ మాలోత్ నరేష్‌ను జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, జిల్లా కార్యదర్శి మహిధర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న సిబ్బంది

చుంచుపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని విద్యానగర్ కాలనీ పంచాయతీలోగల 18 ఎకరాల భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైకోర్టు ఆదేశాలతో సిబ్బంది సోమవారం కూల్చివేశారు. అధికారులు పర్యవేక్షించారు.

'శాతవాహన'కు ఇక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

మధిర, ఫిబ్రవరి 10: శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను అనుసంధానం చేయనున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్ సోమవారం తెలిపారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల ప్రవేశంతో ప్రయాణికులు సురక్షితమైన ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చునని అన్నారు. మధిర, ఖమ్మం, డోర్నకల్ మీదుగా సికింద్రాబాద్, విజయవాడ స్టేషన్ల మధ్య రాకపోకలు సాగించే ఈ శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుల భద్రత, సౌకర్యం కోసం ఈ కీలక మార్పుచేసినట్లు చెప్పారు. శారు. విజయవాడ– సికింద్రాబాద్ స్టేషన్ల మధ్య రాకపోకలు సాగిస్తున్న శాతావహన ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రస్తుతం ఉన్న ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో ఆధునిక ఎల్‌హెచ్‌బీ (లింకే–హాఫ్‌మన్– బుష్) కోచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

శ్రీపాల్‌రెడ్డి నామినేషన్‌కి జిల్లా పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 10: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సోమవారం ఖమ్మం నుంచి పీఆర్టీయూ నాయకులు నల్గొండ తరలివెళ్లారు. 60కార్లలో 300మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, రంగారావు, మోత్కూరి మధు, కట్టా శేఖర్‌రావు పాల్గొన్నారు.

స్పౌజ్ ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఇవ్వాలి

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 10: జిల్లాకు వచ్చిన స్పౌజ్ ఉపాధ్యాయులకు వెంటనే పోస్టింగ్ ఉత్తర్వులివ్వాలని టీపీటీఎఫ్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, వెంగళరావు డిమాండ్ చేశారు. సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. 36 మంది స్పౌజ్‌లో జిల్లాకు వచ్చిన 20రోజులు పూర్తైన నియామకపు ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి: బీఆర్ఎస్

ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 10: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తాచాటాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి ముఖ్య కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. మండలంలోని మోరంపల్లిబంజర్‌లో పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కైపు ఖగేందర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడిగం లక్ష్మీనారాయణరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అలవిగాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిని అమలుచేయడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. దీంతో ప్రజలు కూడా ఈ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. అందుకని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టాలని కోరారు. పార్టీ నాయకులు కైపు ఖగేందర్‌రెడ్డి, బత్తుల రామకొండారెడ్డి, కురుకుంట్ల చిన్నపరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, యక్కంటి శ్రీనివాసరెడ్డి, భద్రయ్య, శెనగ అప్పారావు, బండారు సోమయ్య, మూల బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంచుకోవాలి

కొత్తగూడెం గణేశ్‌టెంపుల్: మాట్లాడుతున్న డీఈవో, టేకులపల్లి: షీల్డ్, సర్టిఫికెట్ అందుకుంటున్న గీత

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఫిబ్రవరి 10: విజ్ఞాన శాస్త్రంపై పిల్లలు ఆసక్తి పెంచుకునేందుకు ప్రతిభా పాఠవ పోటీలు ఉపయోగపడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి అన్నారు. పాత కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో సోమవారం ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి భౌతికశాస్త్ర ప్రతిభా పాఠవ పోటీల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు భౌతిక శాస్త్రాన్ని ఆసక్తితో అభ్యసించి, సమాజానికి అవసరమైన నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. ఈ నెల 12న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయిలో జరిగే ప్రతిభా పాఠవ పోటీకి ఎన్నిక య్యారని డీఈవో చెప్పారు. ఇలాంటి ప్రతిభా పాఠవ పోటీల్లో పాల్గొనటమే ఒక గొప్ప విజయంగా భావించాలన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కార్యదర్శి మాధవరావు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగరాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రథమ విజేతగా గీత

టేకులపల్లి, ఫిబ్రవరి 10: ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ సోమవారం కొత్తగూడెంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నెల్లూరి గీత ప్రథమ విజేతగా నిలిచింది. ఆమెకు బహుమతిని డీఈవో వెంకటేశ్వర చారి ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీకి అర్హత సాధించిన ఆమెను డీఈవోతో పాటు హెచ్ఎం శ్రీనివాస్ అభినందించారు.

సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసానికి వినతి

వినతిపత్రం ఇస్తున్న సొసైటీ డైరెక్టర్లు

టేకులపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావుపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సొసైటీ డైరెక్టర్లు సోమవారం డీసీవో సయ్యద్ ఖుర్షిద్‌కు వినతిపత్రం ఇచ్చారు. మొత్తం 14మంది డైరెక్టర్లలో తొమ్మిది మంది లక్కినేని సురేందర్‌రావుకు వ్యతిరేకంగా ఈ వినతిపత్రం ఇచ్చారు. వీరిలో కంభంపాటి శ్రీనివాస్ చౌదరి, ఉల్లోజ్ ఉదయ్, గుడిపూడి కృష్ణార్జునరావు, డోర్నాల మోహన్ రావు, లక్కినేని శ్యామ్, బాలాజీ, కుమ్మరి లావణ్య, బానోత్ ఇస్తారి, చీమల లక్ష్మీనారాయణ ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు

వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవీంద్రరావు, ఎస్సై సురేశ్

టేకులపల్లి, ఫిబ్రవరి 10: ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే కఠిన చర్యలు ఉంటాయని రోడ్డు పక్కనున్న దుకాణాదారులను ఎస్సై పి.సురేష్, ఎంపీడీవో రవీంద్రరావు హెచ్చరించారు. స్థానిక బోడ్ రోడ్డు సెంటర్, ప్రధాన రహదారుల వెంట దుకాణాల ముందు వాహనాలు నిలిపి ఉండడాన్ని గమనించారు. సంబంధిత దుకాణాదారులను, వాహనదారులను హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం, ఫిబ్రవరి 10: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30లక్షలతో తయారుచేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామి వారికి ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

పర్ణశాల రామాలయంలో మాసకల్యాణం

మాసకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

పర్ణశాల, ఫిబ్రవరి 10: భద్రాచల క్షేత్రానికి అనుబంధ ఆలయం అయిన పర్ణశాల దేవస్థానంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి సోమవారం అర్చకులు మాస కల్యాణం నిర్వహించారు. తొలుత స్వామివారికి విశేష తిరుమంజనం నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు. భక్తులకు చక్కెర పొంగళి ప్రసాదాన్ని అందించారు. ఆలయ ఇన్‌చార్జి అనీల్‌కుమార్, శేషం కిరణ్‌కుమార్ చార్యులు, ముఖ్య అర్చక ప్రతాపురం భార్గవాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు, నలదీగల నరసింహాచార్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మెచ్చా పర్యటన

అశ్వారావుపేట, ఫిబ్రవరి 10: మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు సోమవారం అశ్వారావుపేట పట్టణంలో పర్యటించారు. శుభకార్యాలకు హాజరయ్యారు. పలువురు బాధితులను పరామర్శించారు. నాయకులు జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సంకా ప్రసాద్, మందపాటి మోహన్‌రెడ్డి, సత్యవరపు సంపూర్ణ, శ్రీరామ మూర్తి, తాళం సూరి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఓటర్ల జాబితా: ఎంపీడీవో

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 10: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచినట్లు ఎంపీడీవో తెల్లూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాల కోసం రూపొందించిన ఓటర్ల జాబితాను ఆయా కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు చెప్పారు. ఓటర్లు తమ పేరు, ఇతర వివరాలు సరిగా నమోదు అయ్యాయో లేదో విషయాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా పొరపాట్లు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 10: వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేసినట్లు ఆ శాఖ కొత్తగూడెం సర్కిల్ సూపరింటెండెంట్ మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు తదితర కారణాలతో ఒక లైన్‌లోగానీ, సబ్ స్టేషన్‌లోగానీ విద్యుత్ సరఫరా నిలిచిపోయినా, నిలిపివేసినా.. వినియోగదారులకు ప్రత్యామ్నాయ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేసేందుకు ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొత్తగూడెం సర్కిల్ పరిధిలోగల 14 (33/11 కేవీ) సబ్ స్టేషన్లలో ఇంటర్ లింకింగ్ వ్యవస్థ చేపట్టినట్లు వివరించారు.

16న టీయూసీఐ జిల్లా మహాసభ

ఇల్లెందు, ఫిబ్రవరి 10: ఈ నెల 16న కొత్తగూడెంలో జరిగే టీయూసీఐ జిల్లా మహాసభను కార్మికులంతా జయప్రదం చేయాలని ఇల్లెందు ఏరియా బ్రాంచ్ కార్యదర్శులు మల్లెల వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రఘు కోరారు. ఇల్లెందు సింగరేణి సీఎస్పీ రైల్వే ట్రాక్, రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల మస్టర్ అడ్డా వద్ద సమావేశాలో మాట్లాడారు. నాయకులు గద్దల రాంబాబు, షేక్ యాకూబ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్ల జాప్యంపై స్పందించాలి

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 10: జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తునికాకు సేకరణలో జాప్యంపై ప్రభుత్వం స్పందించాలని, తక్షణమే టెండర్లు ఆహ్వానించి ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని కోరారు. ఆయన సోమవారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు.

నేడు 'దొడ్డి కొమరయ్య' పోస్టర్ ఆవిష్కరణ

పాల్వంచ, ఫిబ్రవరి 10: తెలంగాణ సాయుధ పోరాట ప్రథమ అమరుడు దొడ్డి కొమరయ్య జీవిత చరిత్ర కథాంశంగా రూపొందించిన 'దొడ్డి కొమరయ్య' సినిమా పోస్టర్‌ను ఈ నెల 11న ఆవిష్కరించనున్నట్లు బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెంలోని బీసీ భవనంలో జరిగే కార్యక్రమానికి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావును ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

ముత్యాలమ్మ దుకాణాలకు వేలం

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 10: మండలంలోని వినాయకపురం గ్రామంలోగల శ్రీచిలకలగండి ముత్యాలమ్మ జాదర సందర్భంగా ఆలయ ఆవరణలోని దుకాణాలకు ఈ నెల 13న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సూర్యప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు ఆలయ ఈవోను సంప్రదించవచ్చని సూచించారు.

మోడల్ మార్కెట్ సందర్శన

ఇల్లెందు, ఫిబ్రవరి 10: ఇల్లెందులోని మోడల్ మార్కెట్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం పరిశీలించారు. మార్కెట్ చైర్మన్ బానోత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

చుంచుపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని సర్వారం, హేమచంద్రాపురం, పెనగడప, రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు తదితర సామాగ్రిని కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పన చౌదరి సోమవారం అందించారు. ఎంఈవో బాలాజీ, ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ రూప్లా నాయక్, వలంటీర్ అనిల్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

వైరాటౌన్, ఫిబ్రవరి10: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డుకు చెందిన కాటేపల్లి రామకృష్ణ భార్య కాటేపల్లి సరస్వతి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె నేత్రాలను ఖమ్మం నేత్ర నిధికి దానం చేసేందుకు కుమారులు కాటేపల్లి విజయ్, కాటేపల్లి కిరణ్, కాటేపల్లి నవీన్ ముందుకు వచ్చారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఖమ్మం నేత్రనిధి వారు నేత్రాలను సేకరించారు.

గొత్తికోయ యువతిపై లైంగిక దాడికి యత్నం

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 10: గొత్తికోయ యువతిపై లైంగిక దాడికి దుండగులు యత్నించారు. పోలీసులు తెలిపిన వివరాలు... కూలీ పనుల కోసం పొరుగు రాష్ట్రానికి చెందిన గొత్తికోయ యువతి(20) సోమవారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లోని అడ్డాకు చేరుకుంది. కూలీ పని ఉన్నదంటూ ఆమెను కొందరు వ్యక్తులు ఆటోలో తీసుకెళ్లారు. అనిశెట్టిపల్లి గ్రామ సమీపంలోకి చేరుకోగానే, ఆమెపై వారు లైంగిక దాడికి యత్నించారు. తప్పించుకునేందుకు యత్నించి ఆమెపై వారు కత్తితో దాడి చేశారు. ఆమె ముఖంపై తీవ్ర గాయమైంది. ఆ దుండగులు పారిపోయారు. అక్కడి స్థానికులు ఇచ్చిన సమాచారంతో బాధితురాలిని పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

చండ్రుగొండ, ఫిబ్రవరి 10: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17)పై సోమవారం కేసు నమోదైంది. ఏఎస్సై పాపయ్య తెలిపిన వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో రావికంపాడు గ్రామస్తుడు వినోద్ లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో వినోద్‌పూ రేప్, పోక్సో, ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి.

బైక్‌ను ఢీకొట్టి